# గోడమీద బొమ్మ

**మార్నింగ్ వాక్ నుంచి వస్తూ గుమ్మంలో అడుగు పెట్టబోతూ యాదృచ్ఛికంగా ప్రహరీగోడ వైపు చూసే సరికి నూతిలో రుబ్బురోలు పడినంత శబ్దంతో వరహాల్రావు గుండెల్లో రాయి పడిపోయింది. ఒళ్ళంతా చెమటలు పట్టేశాయి. ముఖం ఎర్రగా మారిపోయింది. ఇవన్నీ కోపం లక్షణాలని వేరే చెప్పనక్కర్లేదేమో. ఆ కోపం ఎవరిమీదా అంటే వ్యక్తిని చూపించలే గాని, ఆ గోడని పాడు చేసిన వాడిమీద అని మాత్రం ఖచ్చితంగా చెప్పొచ్చు.**

చీకటి పూర్తిగా వదలకపోవడంతో రాసిందేమిటో తెలీలేదు. కాని మొన్ననే సున్నం వేయించి తళతళలాడుతున్న గోడ మీద నిన్న రాత్రివరకు ఏం లేకపోడంతో ఏ రాత్రివేళో రాశారని కనిపెట్ట గలిగాడు.

అదే సమయంలో ఏదో మెదిలి తన పేపర్, టి.వి, రేడియో పరిజ్ఞానం మెదడు పొరల్లోంచి బయటికి తోడడం ప్రారంభించాడు.

పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలు మొన్ననే అయాయి కాబట్టి దాని ప్రచారం కాదు. మున్సిపాలిటీలకి ఎన్నికలు జరిగి ఆర్నెల్లే కావడంతో అదీ కాదు. తమ వార్డు కౌన్సిలర్ నిన్న సాయంత్రమే కనిపించాడు కాబట్టి క్షేమంగానే ఉన్నాడు. కాబట్టి ఇది ఎన్నికల ప్రచారం కానేకాదు.

తన ఆలోచనల్ని కాలేజీ వైపు మళ్ళించాడు. ఎందుకంటే తమ ఇంటికి కొద్దిదూరంలో కాలేజీ ఉండడం, అది డిగ్రీ కమ్ జూనియర్ కాలేజీ కావడంతో బాగా పేరుపడిన కాలేజీ అది. పాఠాల్లోనే పోలిటిక్స్ సబ్జెక్టు పెట్టడంతో, సబ్జెక్ట్ విషయం ఎలా ఉన్నా ప్రాక్టికల్‌గా కాలేజీ విద్యార్థులు ఎలక్షన్‌లో పోటాపోటీ పడడంతో అందులో భాగంగా ప్రతిసంవత్సరం తన గోడశీలాన్ని కోల్పోతుంటుంది. కానీ కాలేజీ ఎలక్షన్స్ జరిగి వారం రోజులే అయిందని గుర్తొచ్చింది. అసలు కాలేజీ ఎలక్షన్స్ జరిగాకే మరే హడావుడీ లేదని తను సున్నం వేయించింది. అలాటిది ఇంతలోనే ఇలా వికృతావతారం ఎత్తడంతో గంపవెర్రులెత్తిపోయాడు.

అతడికి కొత్తేం కాదు. ఆ యిల్లు మంచి సెంటర్లో ఉండడంతో ప్రతి అడ్డమైన రాతలకి ఆ గోడ అనువుగా ఉందని రాసేస్తుంటారు. పోతే పోనీ అనుకుని సర్దుకుపోయే గుణం కాదతడిది. అలా రాసిన ప్రతిసారీ సున్నం రాయించి బాగు చేయించుకుంటూంటాడు. కాని ఇంత తొందర్లోనే మదుపుపెట్టాల్సి రావడం బాధగా అన్పించింది. కంట్రోల్ చేసుకుని లోనకెళ్ళి బ్రష్‌చేసి బయటికొచ్చాడు. అప్పటికి కాస్త వెలుతురు రావడంతో ఆ వెలుతురులో ఆదేమిటో చూద్దామని వచ్చిన వరహాల్రావ్‌కి ఇంటి ముందు దృశ్యం మరింత మండించింది. అక్కడ ఇంచుమించు పదిమంది దాకా మూగివున్నారు. తన గోడ వేపే చూస్తూ వాళ్ళల్లో వాళ్ళే నవ్వుకుంటూ ఏదో చర్చించుకుంటూంటే చిరాకేసి గోడకేసి చూసాడు.

అక్కడ రాసిన అక్షరాలు చదివి అణువణువునా ఒణికిపోయాడు. అది ఒణుకుజబ్బుతో మాత్రం కాదు. కోపంతో. అంతలోనే ఆ జనం తన వేపు చూసి గోడవేపు చూస్తూ ఏదేదో అనుకుంటూంటే ఆ సీన్ పరమరోత కలిగించింది. వెంటనే కర్తవ్యం గుర్తొచ్చి ఒక్కసారిగా కేకేసాడు.

"ఏంటయ్యా? ఏంటి చూస్తారు. ఇక్కడేం కోతులాడుతున్నాయా? సిగ్గులేదూ? అసలిలా ఒక ఆడకూతురి మీద సిగ్గులేకుండా రాసినందుకు మనం సిగ్గుతో తలవంచుకోవాలయ్యా" ఆవేశంతో ఊగిపోతూ అన్నాడు. అది విన్నవాళ్ళకది మొరిగినట్లనిపించింది. ఆ మాట వింటూనే గుంపు చెల్లాచెదురై వెళుతూంటే ఎవరో అన్న మాట అతని చెవిలోపడింది.

"పాపం ! అతడికూతురు కాబోల్రా ఎవడో వెంటపడుంటాడు. లొంగలేదు ఉక్రోషంకొలదీ అలా రాశాడు. అయినా కన్నకూతురి మీద అలా రాస్తే ఏ తండ్రికి మాత్రం కడుపు మండదు?" సానుభూతి చూపిస్తూ వెళ్ళిపోతున్నాడొకడు.

ఆ మాటవిన్న వరహాల్రావ్‌కి అలా కూసిన మనుషుల్ని జుత్తు పట్టుకుని లెంపకాయ కొట్టాలన్పించింది. లేకపోతే వెనకనుంచి కళ్ళుమూసి మొట్టికాయలు పెట్టాలన్పించింది. కాని అలా అనుకున్నంతలోనే ఆ వ్యక్తులు కనుమరుగవడంతో ఆ ప్రయత్నాన్ని విరమించుకుని మరో ప్రయత్నంలో పడ్డాడు. ప్రిన్సిపాల్‌కి కంప్లైంట్ చేసి అలా రాసిన వ్యక్తి మీద చర్య తీసుకోమని చెప్పాలని, మిగిలిన కాలకృత్యాలు తీర్చుకుని తొమ్మిదయ్యే సరికి హడావుడిగా బయల్దేరుతున్న వరహాల్రావు నడిగిందాయన భార్య.

"ఎక్కడికండీ ఇంత హడావుడి" భారీ శరీరానికి తోడు వాతపు నొప్పులతో శరీరాన్ని కదపలేక ఆయాసపడుతున్న ఆమెకి వంటలో సాయం చేసే భర్త, వంట సమయంలో ఇలా బయటికెళ్ళిపోతూండడంతో అడిగిందామె.

"అడిగావూ! ఏట్లోకి అయినా బయల్దేరే ముందు ఎక్కడికి అని అడగొద్దన్నానా" బయట వారిమీద చూపలేని కోపం ఆమెపై చూపుతూ విసురుగా బయటికెళ్ళిపోయాడు.

భర్త చిరాకుతో మరేం చేయలేక లోలోనే గొణుక్కుందామె.

అతడు కాలేజీకి చేరేసరికి ప్రిన్సిపాల్ ఉండడంతో పర్మిషన్ తీసుకుని లోనకెళ్ళాడు. విషయమడిగితే అంతా పూసగుచ్చినట్లు చెప్పాడు ప్రిన్సిపాల్‌కి. అంతా విన్నాక ప్రిన్సిపాల్.

"ఐతే ఏం చెయ్యమంటారు?" అన్నాడు చాలా కూల్‌గా. తనంత బాధతో చెబితే అంత కూల్‌గా అతడడిగేసరికి అరికాలి మంటనెత్తికెక్కింది. కాని తమాయించుకుని.

"చెప్పాను కదండీ ఆ స్టూడెంట్ పేరు, క్లాస్‌లో కూడా రాసాడని. పిలిచి ఏక్షన్ తీసుకుంటారని" అన్నాడు. దానికి ప్రిన్సిపాల్.

"పోనిద్దురూ ఏదో కుర్రతనం" అన్నాడు పొగ దీస్తూ. అంతలోనే మరేదో గుర్తొచ్చినట్టు.... పూర్వం మేఘాలతో సందేశాలు పంపుకునే వారట తెల్సా, చెట్లతోటీ తీగలతోటీ మాట్లాడుకుని సందేశాలు పంపుకునే వారట వినలేదూ" అన్నాడు.

"అవునవును ఆ తీగల్తోనే పీకలు ఉరిపోసుకునే వారు అనాలనుకున్నాడు. కాని "విన్నాను" అని మాత్రం అన్నాడు టూకీగా.

"మరైతే ఏమండీ అది ఆ కాలం ప్రేమ. ఇప్పుడు గోడలొచ్చాయి. కాబట్టి ఈరకంగా తెలియ చేసుకుంటున్నారు. అసలింతగా కంప్యూటరైజ్డ్ టెక్నాలజీ పెరిగినా ఇంకా గోడలు మీద రాస్తున్నాడంటే ఆ కుర్రాడెవడో చాలా వెనకబడున్నాడనే అనాలి" అన్నాడు జారిన కళ్ళజోడు లోంచి కళ్ళెత్తి చూస్తూ.

"అలా కాదుసార్ ఆడపిల్లమీద అలా రాస్తే వాళ్ళ జీవితాలేం కావాలి. ఆలోచించండి" అన్నాడు సాగుభూతి కల్గించేట్టుగా పైకలా అన్నా తన గోడపాడైపోయిందనే బాధే ఎక్కువగా మెదిలిందతడి మనసులో.

"చూడండి వాళ్ళ జీవితాలేం కావు. మీకీవిషయం తెలుసా? ఈ కాలం ఆడపిల్లలకి ఇలా రాయించుకోడం ఇష్టమే. ఇలా గోడలకెక్కితే వాళ్ళ స్టేటస్ పెగిరినట్లు భావిస్తారు నేటి అమ్మాయిలు. మీరనవసరంగా హైరానా పడకండి" అంటూ ఏదో జ్ఞాపకం వచ్చిముందుకు వంగి "ఆ అమ్మాయి మీ కూతురుగాని కాదు కదా?" అన్నాడు. అనుమానంగా.

# అయ్యగారి శ్రీనివాసరావు



"నాకసలు కూతుర్లేరండీ బాబు. కాని ఒక ఆడపిల్లమీద అలా రాసినందుకు మీదగ్గరకొచ్చాను" అన్నాడు.

"అయితే మీకెందుకు, నాకెందుకు సున్నం తెచ్చి రాయించేద్దురు. విద్యార్థుల్ని పిలిచి సంజాయిషీ అడగడం చర్య తీసుకోడం చేస్తే ఆపై స్ట్రైకులు, ధర్నాలు, బాయ్‌కాట్లు అంటూ వాళ్ళు నానా హడావుడి చేస్తారు. కామ్‌గా ఊరుకోండి" అన్నాడు కుర్చీలోంచి లేస్తూ.

ఆ మాట వినగానే అదీ నిజమేనన్పించింది. మళ్ళీ అలాటిదేదైనావస్తే తన గోడే బలౌతుందనే భయంతో శలవు తీసుకుని బయటపడ్డాడు.

నేరుగా తాపీమేస్త్రీలున్న చోటుకెళ్ళి ఖాళీగా ఉన్న వాళ్ళల్లో ఒకడ్ని పిలిచి అడిగాడు. దానికతడు.

"మెటీరియల్ మీరిచ్చి రోజు కూలియ్యాలండీ" బీడీ దమ్ములాగుతూ అన్నాడతడు.

"నేనడిగింది బంగ్లాకి సున్నం వెయ్యమని కాదయ్యా, పది హేనడుగులున్న కాంపౌండ్ వాల్‌కి దానికి యాభై రూపాయలా?" అన్నాడు చిరాగ్గా.

"అడుగు గోడకైనా రోజు కూలీ అవుద్దండీ. మీలాటి మారాజులే ఇయ్యకపోతే మాకెలా వస్తాది చెప్పండి. కేజీ బియ్యం ఆర్రూపాయలు, ఉల్లిపాయలు ఎనిమిది, పప్పులు పదిహేన్రూపాయలు అన్ని రేట్లూ పెరిగిపోయాయి కదండీ" అంటూ ఏకరవు పెట్టడం మొదలెట్టాడు.

"నీ సిగదరగ నిన్ను మార్కెట్ రేట్లెవడడిగాడ్రా" అని మనసులోనే తిట్టుకుని.

"నాకవన్నీ ఎందుగ్గానీ పది రూపాయలిస్తాను. అయింతమేరారాసేవయ్యా పది నిమిషాల పని" అన్నాడు.

"కిట్టదండీ, అంతగా బాధపడ్తుతున్నారు కాబట్టి అయిదు తగ్గించుకోండి" అన్నాడు ధర్మం చేస్తున్నట్టు మొహంపెట్టి, ఇంకిది కుదిరేబేరం కాదని అర్థమైపోయింది వరహాల్రావుకి.

"వద్దులే ఇక్కడే బీడీ కాలుస్తూ సాయంత్రం వరకూ కూర్చో ఏభై కాదు వందొస్తుంది" అనేసి చరచరా బయల్దేరాడు.

"చాల్లేవయ్యా బోడి సలహా నిన్నెవడూ అడగలేదు. ఏభై రూపాయలియ్యడానికి గింజుకుంటున్నాడు. సున్న వేయించేముఖమేనీది" అన్న మాట విన్నాక కోపమొచ్చినా వాళ్ళ యూనియన్ గుర్తొచ్చి మరేమనలేక అక్కడ్నుంచెళ్ళిపోయాడు.

బజారులోకెళ్ళి సున్నంపేకెట్, బ్రష్, దాంతోబాటు నీలిమందు పేకెట్‌కొని ఇంటికి తీసుకెళ్ళి భోజనాలయాక పంచె ఎగకట్టి కిందామీద పడి ఒంటికి సగం, గోడకి సగం చొప్పున రాసి మధ్య మధ్యలో సరిగా వచ్చిందో లేదే చూడ్డానికి రోడ్డు మీద కెళ్ళి చూసోస్తూ వచ్చీపోయే జనాల నోటి నుంచి వచ్చే 'కిసుక్కు' శబ్దాలు వింటూ సున్నం అంతా అయిపోపెట్టి మూడు గంటలకి అయిందనించాడు. ఆపై నీలిమందు నీటిలో కలిపి "ఈ గోడపై ఏమియూ వ్రాయరాదు" అని రాశాడు. అలా రాస్తున్నప్పుడు అక్షరానికి రెండు మూడు చుక్కల చొప్పున గోడమీద అక్కడక్కడ రాలడంతో వాటిని తుడవలేక మానలేక సతమతమయ్యాడు.

ఆఖరుకి చెరపడానికే నిశ్చయించుకుని ఒక చుక్క చెరిపేసరికి అప్పటికే అది ఆరిపోవడంతో

చెరగలేదు సరికదా అంగుళంమేర అసహ్యంగా తయారైంది. తప్పనిసరి పరిస్థితుల్లో అడ్డమైన రాతలకంటే చుక్కలు నయమేకదా" అని తన పనిముగించుకుని ఇంట్లోకెళ్ళాడు.

యాభై రూపాయలు మిగుల్చుకున్నందుకు తననితనే అభినందించుకుని సాయంత్రం కావడంతో షికారు బయల్దేరాడు. ఓ గంట అక్కడా ఇక్కడా తిరిగి ఇంటికొచ్చేసరిగి ఇంటి దగ్గర పదిమందిదాకా పిల్లలు మూగి గోలగోలగా ఉండడంతో మనసేదో కీడు శంకించి దగ్గరకెళ్ళాడు.

'ఒరే! మా సూపర్‌స్టార్ చూడరా సూపరాలా గొచ్చాడు' ఒక కుర్రాడంటే.

'ఒరే నేన్చూచాడు' మా గురూగారి కొత్త సిన్మా పేరు ఎలా చెక్కానో' అంటూ సంబరపడిపోతూ చెప్పాడు. దగ్గరకెళ్ళిన వరహాల్రావుకి, సిరలూ, ధమనులు, నరాలూ, పనసపండు తొనల్లా లాగినట్టనిపించింది. అంతలోనే గీసుకున్న చర్మం మీద సురేకారం రాసినట్టు మంటపుట్టి.

"ఒరే...." అంటూ పరుగెత్తి వాళ్ళ దగ్గరకెళ్ళాడు. దొరికిన వాడ్ని దొరికినట్టే చితక్కొట్టాలనేవుద్దేశ్యంతో. కాని వాళ్ళు ఇరవయ్యోకటో శతాబ్దపు పిల్లలనే విషయం గమనించక పోవడం ఆయన పొరపాటు.

అప్పుడూ చూశాడు గోడవేపు. కాళ్ళపారాణి ఆరని నవవధువు బ్రతుకు నాశనమైనట్టు సున్నం తడారని గోడ నీలంరంగు మరకల్తో ఏవేవో సినిమా పేర్లు, హీరోల పేర్లు, వాళ్ళ బిరుదుల్తో నిండిపోయింది. అతడు సంతోషించలేదుగాని సంతోషించే విషయం ఒకటుంది. అదేమిటంటే ఇందాక పడ్డ నీలి మందు మచ్చలు అక్కడ లేకపోవడం.


ఇక ఏం చెయ్యాలో తోచక. ఏం చెయ్యాలన్నా రాత్రయిపోవడంతో లోనకెళ్ళిపోయాడు.

అతడి మనసంతా విషాదం నిండిపోయింది. ఆ గోడ ఒక జీవన్మరణ సమస్య అయిపోయింది. అయితే తెల్లారితే మరో ఆపద వస్తుందని తెలియని పూర్ వరహాల్రావ్‌కి కాస్త కునుకు పట్టింది.

మర్నాడు ఉదయాన్నే గోడ కిందనున్న అరుగుమీద తలపట్టుకుని కూర్చున్న వరహాల్రావ్ వాలకం చూసి ఎదురింటి రంగనాథంకి భయంవేసింది. మనసేదో కీడు శంకించింది. ఎదురింటివాడుగా పరామర్శించకపోతే బాగుండదని మెల్లగా దగ్గరకెళ్ళి అతనిపక్కనే చతికిలపడ్డాడు. వరహాల్రావ్ ఏమీ మాట్లాడకపోవడంతో తనే పలకరించాడు.

'అయ్యా వరహాల్రావ్‌గారు ...'

ఆ మాటకీ లోకంలో కొచ్చిన వరహాల్రావ్ ఎదురుగావున్న రంగనాథాన్ని చూసి గొల్లుమన్నాడు. దాంతో ఊరుకోబెట్టే ధోరణిలో



తండ్రి: కొడుకు ప్రోగ్రెస్ కార్డు చూస్తూ ఏరా పరీక్షల్లో అన్ని సబ్జక్టుల్లోనూ సున్నాలే వచ్చాయి? ఎలా బాగుపడతావురా అంటూ మందలించాడు
కొడుకు: గుడ్ల వ్యాపారం చేసి నాన్న అన్నాడు.
తండ్రి: ఆ((((???

**కూనపులి పద్మజ, గోవా**

ఊరుకోండి. ఏంచేస్తాం. ఇలా జరుగుతుందనుకున్నామా ...? "ఇంకా కొన్నాళ్ళు కలకల్లాడుతుందుకున్నాంగానీ ఇంతలోనే ఇలా జరుగుతుందనుకున్నామా ?" అన్న ఓదార్పు మాటలకి.

"దానికోసం ఈ ఏడాదిలోనూ ఎంత చేసానయ్యా ? ఎన్ని బాధలు పడ్డానయ్యా ? కానీ అన్నీ వికటించి చివరికిలా జరుగుతుందనుకోలేదు" అన్నాడు ముక్కు చీదుతూ.

"బాధపడి ఏం సాధించగలం చెప్పండి ? తర్వాత చెయ్యాల్సిన ఏర్పాట్లు చూడండి" అన్నాడు.

"ఇంకేం ఏర్పాట్లయ్యా నా పిండాకూడు. అక్షరాలంటే సున్నంతో చెరిపేస్తాం. ఈ కాగితం ముక్కలు, దానిమీద పేడ ముద్దలు ఎలా చెరిగిపోతాయ్" అన్నాడు గోడవైపు చూపిస్తూ.

అక్కడ చూసిన రంగనాథంకి వాల్‌పోస్టర్ అంటించిదానిమీద పేడముద్దలు కొట్టబడి, నిన్న పిల్లలచే రకరకాలుగా రాయబడి పరమవికృతంగా కన్పించిందిగోడ. అంతలోనే

"ఏమండోయ్... తెల్లారేసరికి వీధిలో వేశారేంటి బిచాణా ? లోనికి రండీ" అన్న పిలుపు వినబడేసరికి కొన్ని క్షణాలుగుండె ఆగి ఆపై కొట్టుకోవడం మొదలెట్టిది రంగనాథంకి.

"ఇంకా నయం. డైరెక్ట్‌గా తననుకున్న విషయం ఎత్తనందుకు తెల్లారేసరికి పెద్ద గండం గడిచిందని నిట్టూర్చాడు. వరహాల్రావ్ ముఖం వలన ఆయన భార్య కేమయిందోనని అపోహపడిన రంగనాథం.

"ఆ( వస్తున్నానే" అన్న భార్యకి వర్తమానం పంపి "ఇదొకర్తి వెధవసంత. చంపుకు తింటుంది. గోడ పాడై నేనేడుస్తూంటే దీని నస ఒహటి. "బాధ చిరాకు కలగలిపి అనేసరికి వెంటనే వెళ్ళిపోతే బాగుండనిపించిన రంగనాథం.

"అయ్యా ! దానికోచక్కని పరిష్కారం వుంది చెప్పమంటారా ?" అడిగాడు. ఆ మాట విన్న వరహాల్రావ్ ముఖం చేటంత అయింది.

"అదేదో చెప్పి త్వరగా పుణ్యం కట్టుకోవయ్యా ! చచ్చి నీ కడుపున పుడతాను" అన్నాడు దీనంగా.

"ఆ ఆఖరు పనిమాత్రం చెయ్యకండి నేను వేసక్టమీచేయించుకున్నాను" అంటూ కొద్ది క్షణాలాలోచించి వరహాల్రావ్‌కి చెప్పాడు. ఆ మాట విన్న వరహాల్రావ్‌కి ఎడారిలో దాహంతో అలమటించేవాడికి ఫ్రిజ్‌వాటర్ దొరికినంత ఆనందమన్పించింది.

రెండురోజులతర్వాత పసుపుపచ్చని వార్నీష్ మీదరంగు రంగుల వార్నీష్ అక్షరాలతో ముచ్చటైన కంపెనీ వస్తువు బొమ్మతో తళతళ మెరిసిపోతున్న ఎడ్వర్టైజ్‌మెంటుని చూసేసరికి ఎన్నడూ చూడని సుందర దృశ్యాన్ని చూస్తున్న భావనకి లోనయ్యాడు వరహాల్రావ్. అసిన్నాళ్ళూ తనకా ఆలోచన రానందుకు బాధపడుతూనే తనకా సలహా ఇచ్చిన రంగనాథంను మనసులోనే పూజించుకుంటున్నాడు.

"ఏంటిసార్ కొత్తపెళ్ళికూతురిలా మెరిసిపోతోంది గోడ" అన్న పలకరింపు విన్పిస్తే తలతిప్పి చూసాడు. రంగనాథం దగ్గరకొస్తూ కన్పించాడు.

"రావోయ్ రంగనాథం చాలా థాంక్సయ్యా నా సమస్యకి చక్కని పరిష్కారం చూపిచినందుకు నీకు చక్కని కాఫీ ఇవ్వాలనుందోయ్ దా ! అంటూ ఇంట్లోకాహ్వానించాడు వరహాల్రావ్.

"పదండిసార్" అంటూ అతడ్ననుసరించి లోనకెళ్ళాడు రంగనాథం. అయితే అతడిచ్చే కాఫీకంటే ముందు గోడమీద బొమ్మ వెయ్యడానికి కంపెనీవాళ్ళిచ్చే డబ్బు మూడువందలు రంగనాథం జేబులోకి చేర్చుకున్నాడని పాపం వరహాల్రావ్‌కితెలియదు. తెలిసినా ఏమనడేమో ...